క్లుప్తంగా

ప్రతాప్ సాహిత్య సేవలకు కలెక్టర్ అభినందన



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు స్వీయ రచనల పుస్తకాలు ఇస్తున్న ప్రతాప్

సఖినేటిపల్లి: మండలంలో ఉయ్యూరువారి మెరకకు చెందిన కవి, రచయిత, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సాహిత్య సేవలను, కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అభినందించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ప్రతాప్ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, మొక్క అందించారు. ఈ సందర్భంగా స్వీయ రచనల పుస్తకాలను కొన్నింటిని కలెక్టర్‌కు ప్రతాప్ అందజేశారు. దీంతో సాహిత్య సేవలను కొనియాడుతూ ప్రతాప్‌ను కలెక్టర్ అభినందించారు.

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు సత్కారం



కండక్టర్‌కు పురస్కారం అందజేస్తున్న రవిశంకర్

రాజోలు: రాజోలు ఆర్టీసీ డిపో పరిధిలో ఆదర్శ ఉద్యోగులను గురువారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఘనంగా సత్కరించారు. డిపో పరిధిలో విధులు నిర్వహించి అత్యధిక ఈపీకే సాధించిన కండక్టర్లు, అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లను సత్కరించి పురస్కారాలు అందజేశారు. డిపో మేనేజర్ పి.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విజయవాడ జోన్-2 డిప్యూటీ సీఎంఈ ఎస్కే రవిశంకర్ పాల్గొన్నారు. ఆదాయ సముపార్జనతో పాటు ఆర్టీసీ ఉద్యోగులు సమయపాలన పాటించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. ఎస్‌టీఐ కేకే దొర, టీఐ ఎంఏ రావు తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌కు వాటర్ ఫిల్టర్ వితరణ



భవిత సెంటర్‌కు వాటర్ ఫిల్టర్ సమకూర్చిన సత్యనారాయణ, శాంతకుమారి దంపతులు

కొత్తపేట: స్థానిక గౌతమి నగర్‌లోని భవిత సెంటర్‌కు ఒక దాత వాటర్ ఫిల్టర్ బహూకరించారు. గౌతమి నగర్‌కు చెందిన సింగరేణి ప్రాజెక్టు రిటైర్డ్ డిప్యూటీ సూపరిండెంటెంట్ మట్టపర్తి సత్యనారాయణ-శాంతకుమారి దంపతులు రూ.10 వేలు విలువ చేసే వాటర్ ఫిల్టర్‌ను గురువారం ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ హరిప్రసాద్ ఆ దంపతుల సేవా దృక్పథాన్ని అభినందించారు. మానసిక దివ్యాంగులైన బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు భవిత సెంటర్లు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. వాటికి ప్రభుత్వాలు కల్పిస్తున్న వివిధ సౌకర్యాలకు తోడు దాతలు కూడా ముందుకు వచ్చి మరికొన్ని సౌకర్యాలు కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు కడలి సత్యనారాయణ, కేతా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అడ్డుకునేందుకు న్యాయ పోరాటం



రాజోలులో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

రాజోలు: ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు న్యాయ పోరాటాన్ని ఉధృతం చేస్తామని రాజోలు మండల మాలల న్యాయ పోరాట సమితి జేఏసీ అధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ అన్నారు. గురువారం రాజోలులో జరిగిన సమావేశంలో జేఏసీ రాజోలు నియోజకవర్గ కోర్ కమిటీ ఆధ్వర్యంలో మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామం నుంచి మాలలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. మాల సంఘ నాయకులు బత్తుల మురళీకృష్ణ, చింతా మధు, మందపాటి రాజేశ్వరరావు, పోతుమూడి రవికుమార్, కోరుకొండ జగన్, కలిగితి త్రిమూర్తులు, బయ్యా మధుసూదనరావు పాల్గొన్నారు.

యానిమేటర్ల నియామకం

ఆలమూరు: మండలంలోని రెండు గ్రామాల్లో యానిమేటర్ల నియామకం జరిగింది. ఆలమూరు-1, సంధిపూడి గ్రామాల్లో ఖాళీ అయిన పోస్టుల ఎంపికకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గురువారం గ్రామ మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. ఆయా గ్రామ మహిళ సంఘ సభ్యులు ఆలమూరు- యానిమేటర్‌గా డి.విజయలక్ష్మి, సంధిపూడి యానిమేటర్‌గా పి.జ్యోతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆరు నెలలు కావస్తున్నా..

- అంగన్‌వాడీ కేంద్రాలకు చేరని పీపీ-1, పీపీ-2 పుస్తకాల కిట్లు
- ఉన్న పుస్తకాలతోనే విద్యాబోధన



పీపీ బుక్స్



మాచవరం అంగన్‌వాడీ కేంద్రంలో పీపీ బుక్స్‌ను రాస్తున్న చిన్నారులు

అంబాజీపేట: బాల్యదశలోనే విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వీరికి ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలను గత ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు అందజేసేది. కేంద్రాలకు వచ్చే 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆంగ్ల బోధనను అందించాలనే ఉద్దేశంతో నాలుగు పుస్తకాలతో కూడిన పీపీ-1, పీపీ-2 కిట్లు అందించింది. కాన్వెంట్ తరహాలో ఆంగ్ల బోధన అంగన్వాడీ కేంద్రాల్లో అందించడం ద్వారా పిల్లలను తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాలకు పంపించేవారు. బోధనకు సంబంధించి 3-4 ఏళ్ల లోపు చిన్నారులకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌లకు సంబంధించిన 5 పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లు, 4-5 ఏళ్ల వయసు కలిగిన చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లు అందించేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో పీపీ కిట్లను ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేసేవారు. అయితే పీపీ కిట్లు తెలుగు కాకుండా కన్నడ భాషలో ఉన్న పుస్తకాలు వచ్చాయని వాటి స్థానంలో తెలుగు పుస్తకాలు పంపడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందని విమర్శలు వస్తున్నాయి.

నియోజక వర్గం	అంగన్‌వాడీ కేంద్రాలు	6 నుంచి 3 సంవత్సరాలు	3 నుంచి 6 సంవత్సరాలు
పి.గన్నవరం	276	6,399	2,628
కొత్తపేట	265	6,735	3,127
రాజోలు	223	5,221	2,221

పాత పద్ధతిలోనే బోధన

ప్రస్తుత ప్రభుత్వంలో 6 నెలల నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు నేటి వరకు అందకపోవడంతో పాత పద్ధతిలోనే బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల దాటుతున్నా ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించలేదు. ఈ పుస్తకాల్లో చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యంశాలు ఉండటంతో తల్లిదండ్రులు విధిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపేవారు. అయితే ఈ ఏడాది నేటి వరకు పుస్తకాలు రాకపోవడంతో ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు తమ చిన్నారులను కాన్వెంట్లలో చేర్పించారు. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే విధంగా వారికి అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇదిలా ఉండగా అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించడంలో ఉన్నతాధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లకపోయినా హాజరుశాతం మాత్రం ఫుల్‌గా ఉంటుందని విమర్శలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చిన్నారులకు ఉపయోగకరంగా ఉండేలా టాయిలెట్స్‌ను నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

కొత్త పుస్తకాలు రావాల్సి ఉంది



ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త పుస్తకాలు ఇంకా ప్రభుత్వం నుంచి రాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరున కన్నడ భాషలో ఉన్న పుస్తకాలు వచ్చాయి. తెలుగు పుస్తకాలు రాలేదన్న విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. పుస్తకాలు రాగానే కేంద్రాలకు పంపుతాం. ప్రస్తుతం ఉన్న పుస్తకాలతోనే చిన్నారులకు బోధిస్తున్నాం.

– డి.వెంకటేశ్వరి, సీడీపీఓ, పి.గన్నవరం

పీపీ పుస్తకాలను త్వరితగతి ఇవ్వాలి



కేంద్రాలలో నాణ్యమైన విద్యా బోధన అందించాలి. తరచూ అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు వచ్చేలా చూసి వారికి పౌష్టికాహారం అందించాలి. కేంద్రానికి రావాల్సిన పీపీ పుస్తకాలను త్వరితగతిన వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద టాయిలెట్లను నిర్మించాలి.

– కముజు దీవెన, అంబాజీపేట

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అంబాజీపేట: మండలంలో అంబాజీపేట, గంగలకుర్రు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ ప్రకటనలో తెలిపారు. అంబాజీపేట, గంగలకుర్రు సబ్‌స్టేషన్ పరిధిలో అంబాజీపేట, తొండవరం, వాకలగరువు, కె.పెదపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, నడిపూడి, పాలగుమ్మి, బండారులంక గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 33 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపట్టనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయినవిల్లి మండలంలో..

అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపాలెం ఫీడర్ పరిధిలోని 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల నిమిత్తం నాలుగు గంటల పాటు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.మూలపాలెం, కొండుకుదురు, క్రాపపాలెం, శానపల్లిలంక, కొండుకుదురు, పొట్టిలంక గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో విద్యుత్ శాఖ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మలికిపురంలో..

మలికిపురం: విద్యుత్ లైన్ల వెంబడి చెట్ల తొలగింపులో భాగంగా శుక్రవారం మలికిపురం, లక్కవరం, గొల్లపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ మద్దూరి సతీష్ గురువారం తెలిపారు. తూర్పుపాలెం, లక్కవరం, విశ్వేశ్వరాయపురం, కత్తిమండ, మలికిపురం, రామరాజులంక , దిండి, గుడిమెళ్లంక, కేశనపల్లి, మేడిచర్లపాలెం, చింతలమోరి, శంకర గుప్తం తదితర గ్రామాలకు అంతరాయం ఉంటుందన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రావులపాడు, ఊబలంక, కొమరాజులంక గ్రామాలతో పాటు రావులపాలెంలోని డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియా, సీఆర్‌సీ రోడ్డు, ఆదిలక్ష్మినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మండలంలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లి, మట్టలదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు, వెదిరేశ్వరం, కోసూరి నగర్, గరువు, ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్సైతో వర్తక సంఘ నేతల భేటీ



ఎస్సై సురేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న లక్కవరం వర్తక సంఘం నాయకులు

మలికిపురం: స్థానిక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పీవీఎస్ఎస్ సురేష్‌ను శుక్రవారం లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. స్టేషన్లో కలిసి శాలువా కప్పి, బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం చాంబర్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు మరింత మెరుగు పరచాలని, మా చాంబర్ సహాయ సహకారాలు ఎల్లప్పుడు పోలీసులకి అండగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో పలచోళ్ళ రాంబాబు, యాతం కృష్ణ, మండేల రామ్మూర్తి, కడియాల సూర్యప్రకాశరావు, పలచోళ్ళ నారాయణరావు, పెచ్చెట్టి శివశంకర్, కేసరి బుజ్జి, ముదునూరి హరి రామలింగరాజు, బొడ్డపాటి బుజ్జి, బోనం రాము, వలవల రాంబాబు, అంబటి రామ్మోహనరావు, బొలిగర్ల మనోజ్, గుబ్బల పాండురంగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అలీ అస్గర్‌కు కన్నీటి నివాళి



ఊయల ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు ఆరు నెలల పసికందు హజరత్ అలీ అస్గర్‌కు ముస్లింలు బుధవారం రాత్రి నిండుశోకంతో నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా నగరంలోని బీబీ ఫాతిమా జహెరా పంజా నుంచి అలీ అస్గర్ ఊయలను తీసి ఊరేగించారు. గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహిస్తూ అలీ అస్గర్‌కు నివాళులర్పించారు. సజ్జాద్ హుస్సేన్ సాజిద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పంజాలో జరిగిన మజ్లిస్‌లో మత ప్రబోధకులు సయ్యద్ అబ్బాస్ బాకరి మజ్లిస్ ఆలపించారు. నగరం పెద పంజీషా వరకు ఊయలను ఊరేగించారు. మహిళలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

అయినవిల్లి/రావులపాలెం/మలికిపురం/సఖినేటిపల్లి/మామిడికుదురు/కొత్తపేట/ఆలమూరు/పి.గన్నవరం/అంబాజీపేట: అయినవిల్లి మండలంలోని 71 పాఠశాలలకు గాను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు గురువారం ఎన్నికైనట్లు ఈఏఈ-2 పి.శ్రీనివాసరావు తెలిపారు. రావులపాలెం మండలంలోని 55 స్కూళ్లలోనూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగి కమిటీలు ఏర్పడ్డాయని ఎంఈవో తెలిపారు. మలికిపురం మండలంలోని అన్ని పాఠశాలలకు ఎస్ఎంసీ కమిటీలు ఏర్పడ్డాయి. ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగాయి.

సఖినేటిపల్లి మండల వ్యాప్తంగా 79 పాఠశాల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవో-1 డి.కిషోర్ కుమార్ తెలిపారు. మామిడికుదురు మండలంలో మొత్తం 72 స్కూళ్లకు గాను 71 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయని ఎంఈఓలు ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు తెలిపారు. కొమరాడ పాఠశాలలో విద్యార్థులు లేక పోవడం (జీరో ఎన్‌రోల్‌మెంట్) కారణంగా అక్కడ ఎన్నికలు నిర్వహించలేదన్నారు. కొత్తపేట మండలంలో 83 పాఠశాలలకు 49 పాఠశాలల్లో ఏకగ్రీవంగా, 34 పాఠశాలల్లో ఓటింగ్ ద్వారా కమిటీలను ఎన్నుకున్నారని ఎంఈవో ఎం.హరిప్రసాద్ తెలిపారు. ఆలమూరు మండలంలోని 50 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పి.గన్నవరం మండలంలోని ఆర్.ఏనుగుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికలు పంచాయతీ ఎన్నికల పోరును తలపించాయి. మండలంలోని 84 ప్రభుత్వ పాఠశాలలకు గాను 53 ఎస్ఎంసీలు ఏకగ్రీవంగా కాగా, 31 ఎస్ఎంసీలకు ఎన్నికలు జరిగాయని ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. అంబాజీపేట మండలంలోని గ్రామాల్లో ఉన్న పాఠశాలలపై కూటమి పార్టీల నాయకులు పెత్తనాన్ని నిరూపించుకోవడానికి పాఠశాల ఎన్నికల్లో రాజకీయాలు చేశారు. ఈ మేరకు కూటమికి చెందిన వారినే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నుకొన్నారు.

10, 11 తేదీల్లో కోనసీమ బాలోత్సవం

కొత్తపేటలో జిల్లా స్థాయి పిల్లల పండుగ



కోనసీమ బాలోత్సవం లోగో

కొత్తపేట: ×కోనసీమ బాలోత్సవం? మొదటి పిల్లల పండుగ పేరిట కొత్తపేటలో రెండు రోజుల పాటు కల్చరల్, అకడమిక్ పోటీలతో పిల్లలు అలరించనున్నారు. మనం ట్రస్ట్, జితేంద్ర సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 10, 11 తేదీల్లో బాలోత్సవం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ అసోసియేట్ అధ్యక్షుడు కర్రి కాశీవిశ్వనాథం, ప్రధాన కార్యదర్శి కట్టా వీరబాబు, కార్యదర్శులు వై.పవన్‌కుమార్, మట్టపర్తి జితేంద్ర గురువారం విలేకరులతో మాట్లాడుతూ బాలోత్సవ కార్యక్రమాలను వివరించారు. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బాలలు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బాలలను జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అకడమిక్ ఈవెంట్స్ విభాగంలో చిత్రలేఖనం (స్పాట్ డ్రాయింగ్), కార్టూన్, తెలుగు, ఇంగ్లీష్ వ్యాసరచన, వక్తృత్వం తదితర 40 పోటీలు, కల్చరల్ ఈవెంట్స్‌లో ఏకపాత్రాభినయం, క్లాసికల్ డాన్స్ సోలో, విచిత్ర వేషధారణ, జానపద నృత్యం, లఘు నాటిక తదితర 16 పోటీలు ద్వారా పిల్లలు విశేషంగా అలరించనున్నారని వారు తెలిపారు. అందుకు ఆరు వేదికలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఆహ్వాన సంఘం చైర్‌పర్సన్‌గా, ఆర్‌డీఓ జీవీవీ సత్యనారాయణ గౌరవాధ్యక్షుడిగా, తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అధ్యక్షుడిగా, డీఎస్పీ కె.వెంకటరమణ గౌరవ సలహాదారుగా వ్యవహరించే ఈ కార్యక్రమాల్లో జిల్లాలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

వర్గీకరణతో మాలలకు తీవ్ర నష్టం



మలికిపురంలో ఎమ్మెల్యే దేవకకు వినతిపత్రం ఇస్తున్న మాల సంఘాల నాయకులు

మలికిపురం: ఎస్సీ వర్గీకరణతో ఆంధ్రప్రదేశ్‌లోని మాలలకు తీవ్రనష్టం వాటిల్లుందని రాజోలు నియోజక వర్గ మాలలు పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు మలికిపురంలో గురువారం వినతిపత్రం అందించారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశం గతంలో సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జిలతో కూడిన ధర్మాసనం కొట్టి వేసిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మాలలకు జరుగుతున్న నష్టాన్ని శాసనసభలోనూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తమ వేదనను తీసుకు వెళ్లవలసిందిగా కోరారు. కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు చింతా రాజబాబు, టీడీపీ నాయకులు గెడ్డం సింహా, జగడం సత్యనారాయణ, రాపాక ఆనందకుమార్, ఎంపీటీసీ తోటి రాజేశ్, తాడి సహదేవ్, తదితరులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

చిన్నపాటి వర్షానికే రహదారి చిత్తడి



ముక్తేశ్వరంలోని ముంపుతో అధ్వానంగా ఉన్న రహదారి

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలోని ముక్తేశ్వరంలో ఎంపీయూపీ స్కూల్ వద్ద ఉన్న సీసీ రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు చెబుతున్నారు. అయితే పాఠశాలలకు వచ్చే విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలతో పాటు ఇక్కడ రెండు ప్రైవేటు పాఠశాలలు, ఒక ప్రైవేటు కళాశాల కూడా ఉంది. వీటికి సుమారుగా వేయి మంది వరకూ విద్యార్థులు చదువుకునేందుకు ఈ రహదారిపైనే రాకపోకలు కొనసాగిస్తున్నారు. అలాగే ఈ రోడ్డులో ఓ బ్యాంకు కూడా ఉంది. ఇంత తాకిడి ఉన్న రహదారికి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. ఈ రహదారి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాద బాధితుడి వైద్యానికి రూ.20 వేల సాయం



బాధితుడి తల్లిదండ్రులకు సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలోని కొత్తకాలనీకి చెందిన బంగారు జాన్సన్ (20) మూడు రోజుల క్రితం పొట్టిలంక హైవే మీద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో రాజమహేంద్రవరం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఒక రోజుకు 20 వేల వరకు ఖర్చవుతుంది. వీళ్లకి అంత స్తోమత లేకపోవడంతో అందరిని సహాయం కోరుతున్నారు. స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను కోరగా ఈరోజు రావులపాలెంలో జాన్సన్ తల్లిదండ్రులకు సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.20 వేలు నగదు అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

ఆత్రేయపురం: అదనపు కట్నంపై భర్త, అత్తమామలు, ఆడపడుచు వేధిస్తున్నారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ప్రకారం ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన కోట వీరమణి ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తుంది. 2021లో తాడేపల్లిగూడెం మండలం లింగరాయుడుగూడేనికి చెందిన ఎలిగంటి అంతర్వేది సరసన్నతో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.2 లక్షల కట్నం, రూ.50 వేలు ఆడపడుచు కట్నం ఇచ్చారు. వివాహ సమయంలో ఉద్యోగం వస్తుందని నమ్మించి వివాహం చేశారు. సరసన్న చెడు వ్యవసనాలకు బానిసై వేధిస్తున్నాడు. అదనపు కట్నం కోసం భర్త నరసన్నతో పాటు అత్త, మామలు, ఆడపడుచు వేధిస్తున్నారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

డీఎస్పీ రమణ బదిలీ



కొత్తపేట: స్థానిక సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కేవీ రమణ బదిలీ అయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నూతనంగా రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుచేసిన సందర్భంగా తొలి డీఎస్పీగా రమణ నియమితులయ్యారు. ప్రస్తుతం పోలీస్ బదిలీల్లో భాగంగా ఆయనను సీఐడీ విభాగం అమరావతికి బదిలీ చేశారు. ఆయన రిలీవ్ కావల్సివుంది. ఆయన స్థానంలో నూతన డీఎస్పీని లేదా సమీప డీఎస్పీని ఇన్‌చార్జ్‌గా నియమించవలసివుంది.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బుజ్జిరాజు

మలికిపురం: పి.గన్నవరం మండలం ముంజవరపుకొట్టు గ్రామానికి చెందిన నక్కా నరసింహారావు కుమారుడు నాగ వెంకట సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడికి వసుధ ఫౌండేషన్ రూ.20 వేలను ఆర్థిక సాయంగా అందించింది. చైర్మన్ మంతెన వెంకట రామరాజు అందించిన ఆర్థిక సాయాన్ని చెక్‌ల రూపేణా గురువారం మలికిపురంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి బోనం రాజుతో పాటు నల్లి మోహన్, గిడుగు తాతాలు, కొట్టు హేమకుమార్, బాబీ, గ్రామాల్లోని పెద్దలు పాల్గొని వెంకట రామరాజు చేస్తున్న సేవలను కొనియాడారు.

నేడు వరలక్ష్మీ వ్రత పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలోని ఉపాలయంలో కొలువైన రాజ్యలక్ష్మి తాయారు సన్నిధిలో శ్రావణ మాసంలోని మొదటి శుక్రవారం వరలక్ష్మి కుంకుమ పూజలకు ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ నెలలో 9, 16, 23, 30 తేదీల్లో వచ్చే శుక్రవారాల్లో రాజ్యలక్ష్మీ తాయారు సన్నిధిలో మహిళల కోసం వరలక్ష్మీ కుంకుమ పూజలు ఏర్పాటు చేశామన్నారు. అమ్మవారి పూజల్లో పాల్గొనే భక్తులకు దేవస్థానం తరఫున అమ్మవారి రూపు, పూజా సామగ్రి, ప్రసాదం ఉచితంగా పంపిణీ చేస్తామని ఆయన అన్నారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఏర్పాటు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి గురువారం తెలిపారు. శ్రావణ పంచమిని పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ప్రారంభిస్తామన్నారు. భారీ సంఖ్యలో మహిళలు ఈ పూజకి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జీవన ఎరువులు వాడాలి

అంబాజీపేట: ఖరీఫ్ వరి సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువులతో పాటు పచ్చిరొట్ట, కంపోస్టు, ఎరువుల వాడకం వల్ల ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు చెప్పారు. మండలంలోని ఇరుసుమండలో గురువారం పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామమోహనరావు మాట్లాడుతూ వరి పంటకు ప్రధాన పోషకాలు అయిన నత్రజని, భాస్వరం, పొటాష్, ఎరువులను వాడాలని సూచించారు. సేంద్రియ, కంపోస్టు, పచ్చిరొట్ట, జీవన ఎరువుల వాడకం వల్ల సూక్ష్మ పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో కృషీవల కోకోనట్ కంపెనీ సీఈవో అడ్డాల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో వ్యక్తి అరెస్ట్



గంజాయి నిందితుడిని అరెస్టు చేసిన ఎస్సై

మలికిపురం: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక గ్రామానికి చెందిన ముద్దాయి మిరియాల బన్నును అరెస్టు చేసి కోర్టుకు పంపినట్లు ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఇకమీదట ఎవరైనా గంజాయి తాగినా.. లేక అమ్మినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. అలాగే మండలంలోని ఇరుసుమండ శివారులో జరుగుతున్న కోడిపందాలపై దాడి చేసినట్లు ఎస్సై తెలిలపారు. పందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రెండు కత్తులు, రూ.2200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

మామిడికుదురు: ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత సూచించారు. మామిడికుదురులోని కొర్లగుంట రోడ్డులో హైదరాబాద్ నుంచి వచ్చిన సీహెచ్ భరత్‌కు డెంగీ జ్వరం నిర్ధారణ కావడంలో గురువారం ఆ పరిసర ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ సర్వేను డాక్టర్ స్వర్ణలత పరిశీలించారు. ఫీవర్ సర్వేలో జ్వర పీడిత కేసులు ఏమీ నమోదు కాలేదని ఆమె తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కాచిన నీటినే తాగాలని సూచించారు. ఆమె వెంట సీహెచ్ఓ సత్యవతి, పీహెచ్ఎన్ జె.నారాయణమ్మ, సూపర్ వైజర్ బీవీవీ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, ఏఎన్ఎంలు కె.దుర్గాదేవి, ఎం.జయకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ రోషిణి, శిరీష, ఆశ కార్యకర్తలు లక్ష్మీకుమారి, మాధురి, ప్రభావతి, లక్ష్మి పాల్గొన్నారు.